సాక్షి మంచిర్యాల

ఆదివారం । 24 । సెప్టెంబర్ । 2023



విత్తన గణపతిం భజే..! 8లో ▸

పర్యావరణ హితానికి మహిళా సంఘాల ఆధ్వర్యంలో విత్తన మట్టి గణపతులు తయారు చేశారు. ఐదు రకాల విత్తనాలతో తయారు చేసిన ప్రతిమలను గ్రామాల్లో పంపిణీ చేశారు.



వైభవంగా గణపయ్యకు పూజలు

గణపతి నవరాత్రోత్సవాలు జిల్లా వ్యాప్తంగా అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఆయా మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
31.0 /24.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణం చల్లబడుతుంది. పలుచోట్ల జల్లులు కురిసే అవకాశముంది.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



పూలతో వేంకటేశ్వరస్వామి అలంకరణ

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాలలోని విశ్వనాథ కాలక్షేప మండపంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో శనివారం రాత్రి వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో కొత్త రాజేశం, జయప్రకాశ్, మోటూరి అశోక్ దంపతులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

న్యూస్‌రీల్

జిల్లాలో 9.9 మిల్లీమీటర్ల వర్షపాతం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో నాలుగురోజులుగా మోస్తరు వర్షం కురుస్తోంది. శుక్రవారం నుంచి శనివారం వరకు 9.9 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. భీమినిలో 37.1 మిల్లీమీటర్లు, కన్నెపల్లిలో 21.5, బెల్లంపల్లిలో 15.6, తాండూర్‌లో 14.7, కాసిపేటలో 13.6, చెన్నూర్‌లో 9, కోటపల్లిలో 8.2, వేమనపల్లిలో 8.1, జన్నారంలో 7.4, నెన్నెలలో 6.2, భీమారంలో 6.2, మంచిర్యాలలో 5.1, నస్పూర్‌లో 6.7, మందమర్రిలో 6.3, దండేపల్లిలో 4.1, హాజీపూర్‌లో 4.3, జైపూర్‌లో 3.7, లక్సెట్టిపేటలో 0.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లా సాధారణ వర్షపాతం 913 మిల్లీమీటర్లు కాగా, 999.8 మిల్లీమీటర్లు కురిసి 10శాతం నమోదైంది.

పిల్లలను రోజూ పాఠశాలకు పంపించాలి




విద్యార్థిని ప్రశ్నిస్తున్న డీఈవో యాదయ్య

బెల్లంపల్లి: పిల్లలను రోజూ బడికి పంపించాలని జిల్లా విద్యాశాఖాధికారి యాదయ్య సూచించారు. శనివారం బెల్లంపల్లిలోని నంబర్–2 ఇంక్లైన్ పాఠశాలను స్టేట్‌లెవెల్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో భాగంగా ఆయన సందర్శించారు. తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రమం తప్పకుండా పిల్లలను పాఠశాలకు పంపించడం అలవాటు చేయాలని సూచించారు. రోజువారీగా బడికి పంపించకుంటే విద్యార్థులకు పాఠాలు సరిగా అర్థం కావని, ఇంటి దగ్గర చదువుకునే వాతావరణాన్ని తల్లిదండ్రులు కల్పించాలని, అడపాదడప పాఠశాలకు వెళ్లి పిల్లల చదువు గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఎంఈవో మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను చిన్నతనంలో నంబర్–2 ఇంక్లైన్‌బడిలో చదువుకుని ఈ స్థాయికి వచ్చానని చెప్పారు. సెక్టోరియల్ ఆఫీసర్లు చౌదరి, సత్యనారాయణమూర్తి, ప్రధానోపాధ్యాయుడు విష్ణువర్ధన్, ఎస్‌ఎంసీ చైర్మన్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రాక్టీస్ పరీక్షలు

మంచిర్యాలఅర్బన్: కనీస అభ్యసన సామర్థ్యాల అంచనాకు నిర్వహించే స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో భాగంగా జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు ప్రాక్టీస్ పరీక్షలు నిర్వహించారు. కాగా, ఈనెల 27న, అక్టోబర్ 3, 27, 31, నవంబర్ 2న పరీక్షలు నిర్వహించనున్నారు. శనివారం 5,044 మంది మూడో తరగతి విద్యార్థులు, 4,546 మంది ఆరోతరగతి విద్యార్థులు, 4,546 మంది తొమ్మిదో తరగతి విద్యార్థులకు ప్రాక్టీస్ పరీక్షలు నిర్వహించారు. పరీక్షాకేంద్రాలను డీఈవో యాదయ్య, డీసీఈబీ కార్యదర్శి భీంరావు పరిశీలించారు.

28న గణేశ్ నిమజ్జనం



కరపత్రం ఆవిష్కరిస్తున్న సమితి సభ్యులు

మంచిర్యాలటౌన్: ఈ నెల 28వ తేదీన గణేశ్ నిమజ్జనం నిర్వహించాలని హిందూ ఉత్సవసమితి సభ్యులు కోరారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. 25వ తేదీన సాయంత్రం 4 గంటలకు ఎస్ కన్వెన్షన్ హాల్‌లో దీనిపై గణేశ్ మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. గౌరవాధ్యక్షుడు గోలి రాము, అధ్యక్షుడు పోటు తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షులు తుల ఆంజనేయులు, సురేశ్ బల్దువా, కార్యదర్శి కే సురేంద్రచారి, కర్ణకంటి రవీందర్, కోశాధికారి శ్రీనివాస్ జైన పాల్గొన్నారు.

డేంజర్ 'లోడ్'..!



కోటపల్లి మండలం కొల్లూరు క్వారీ నుంచి ఓవర్ లోడ్‌తో వెళ్తున్న ఇసుక లారీలు (ఫైల్)

- ఛిద్రమవుతున్న జాతీయ రహదారి–16
- పూర్తి కాకుండానే గుంతలుపడిన వైనం
- అధిక లోడ్ ఇసుక వాహనాలే కారణం
- తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
- ఇబ్బందుల్లో వాహనచోదకులు, ప్రజలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: గోదావరి నుంచి ఓవర్ లోడ్‌తో వెళ్తున్న ఇసుక లారీలు జిల్లాలోని రోడ్లను దెబ్బతీస్తున్నాయి. టీఎస్‌ఎండీసీ పరిధిలోని ఇసుక క్వారీలున్న చెన్నూరు, కోటపల్లి మండల పరిధిలోని క్వారీల నుంచి అధిక లోడ్‌తో ఇసుక వాహనాలు వెళ్తుండడంతో ఇప్పటికే నూతనంగా నిర్మిస్తున్న జాతీయ రహదారి–16 చాలాచోట్ల ధ్వంసమైంది. ఆరేళ్లుగా ఈ రోడ్డు నిర్మాణ పనులు సాగుతుండగా మరోవైపు భారీ ఇసుక వాహనాల రాకపోకలతో తీవ్ర నష్టం వాటిల్లుతోంది. రూ.కోట్ల ప్రజాధనంతో వెచ్చిస్తున్న రోడ్డు చాలాచోట్ల గుంతలు పడి, కంకర తేలింది. ఓవర్‌లోడ్‌తో వెళ్లే వాహనాలపై మైనింగ్, ఆర్టీఏ, పోలీస్ అధికారులు దృష్టి సారించకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరగడమే కాకుండా రహదారులు ధ్వంసమవుతున్నాయి. 2017లో జాతీయ రహదారి నిర్మాణానికి ఆ మోదం తెలిపే ముందు ఈస్థాయి భారీ వాహనాల రద్దీ ఉంటుందని అంచనా వేయలేదు. తర్వాత ఇసుక క్వారీలు రావడంతో రోడ్డుపై అంచనాకు మించి ట్రాఫిక్ పెరిగింది. దీంతో జాతీయ రహదారిపై ఒత్తిడి పెరిగింది. ఈ కారణంగా రోడ్డు పలుసార్లు ధ్వంసమైంది. మొదట నిర్మించేటప్పుడు క్రస్ట్ తక్కువగా ఉంది. నిర్మాణంలో కంకర, మట్టి, తారు, భూమిలోతు తదితరాలన్నీ లెక్కలోకి తీసుకుంటారు. అయితే భారీ వాహనాలు తక్కువ క్రస్ట్‌తో నిర్మించడంతో తట్టుకోలేకపోవడంతో నష్టం జరుగుతోంది.

పట్టించుకోని సంబంధిత శాఖల అధికారులు

ఓవర్ లోడ్‌తో ఇసుకలారీలు వెళ్తున్నప్పటికీ టీఎస్‌ఎండీసీ, రోడ్డు రవాణా, పోలీస్ అధికారులు పట్టించుకుంటలేదు. కొన్నేళ్లుగా ఈ రోడ్డుపై భారీ వాహనాల రాకపోకలతో చాలావరకు ప్రమాదానికి గురైంది. వాగుల వద్ద బ్రిడ్జిలు ఎత్తు ఉన్నా ఒత్తిడి పడింది. చాలాచోట్ల గుంతలు కూడా ఏర్పడ్డాయి. నిర్మించక ముందే తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. మరో నాలుగేళ్లపాటు కాంట్రాక్టర్‌కు నిర్వహణ బాధ్యత ఉంది.

కుంగిపోతున్న జాతీయ రహదారి

కోటపల్లి మండలం కొల్లూరు క్వారీ నుంచి ఐదేళ్లుగా ఇసుక వెలికితీత, డంప్‌యార్డు, రవాణా సాగుతోంది. ప్రస్తుతం వానాకాలం నేపథ్యంలో రవాణాకు ఆటంకం ఏర్పడి ఆగిపోయింది. అయితే ఇప్పటికే నాలుగుచోట్ల క్వారీల సామర్థ్యం పూర్తయింది. మూడేళ్లుగా వందలాది భారీ వాహనాలు రోడ్డుపై వెళ్తుండడంతో అనేక చోట్ల ధ్వంసమైంది. జోడువాగు వద్ద పాత వంతెనపైనే భారీ వాహనాలు వెళ్లడంతో దానికి ప్రమాదం పొంచి ఉంది. ఇక కొత్తగా వేసిన రోడ్డు కూడా పలుచోట్ల కుంగింది. క్వారీలకు వెళ్లేటప్పుడు ఖాళీగా వెళ్లే వాహనాలు తిరిగి వచ్చేటప్పుడు లోడ్‌తో వస్తున్నాయి. దీంతో చెన్నూరు వైపు వెళ్లే రోడ్డు కాకుండా లోడ్ వచ్చే మంచిర్యాల వైపు వచ్చే రోడ్డు అధికంగా దెబ్బతింటోంది. పరిమితికి మించి ఇసుకను కాంట్రాక్టర్లు వాహనాల్లో లోడ్ చేస్తున్నారు. ఒక్కో వాహన సామర్థ్యానికి అనుగుణంగా డీడీ చెల్లించినా వాటిలో కనీసం 8క్యూబిక్ మీటర్ల నుంచి 20క్యూబిక్ మీటర్ల వరకు రవాణా చేస్తుంటాయి. అంటే 12.8టన్నుల నుంచి 32టన్నుల వరకు లోడింగ్ చేయాలి. అయితే ఒక్కో లారీకి అదనంగా బకెట్ వేయడంతో పరిమితికి మించి వాహనాల్లో ఇసుక రవాణా అవుతుండడంతో పలుసార్లు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. రోడ్డు కూడా దెబ్బతిన్నది. దీంతో వాహన చోదకులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.



జైపూర్ శివారులో రోడ్డుపై ఏర్పడ్డ గుంత

గ్రూప్–1 అభ్యర్థులకు నిరాశే

- వరుసగా రెండోసారి రద్దైన పరీక్ష
- ఆందోళన చెందుతున్న అభ్యర్థులు
- అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం



మంచిర్యాలలో గ్రూప్–1 రాసేందుకు పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు (ఫైల్)

16.10.2022 నాటి అభ్యర్థుల వివరాలు	
మొత్తం అభ్యర్థులు	9,243
హాజరైనవారు	7,259
గైర్హాజరైనవారు	1984
11.06.2023 నాటి అభ్యర్థుల వివరాలు	
హాజరైనవారు	6,076
గైర్హాజరైనవారు	3,167

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రాష్ట్రస్థాయిలో అత్యున్నత కొలువులైన డిప్యూటీ కలెక్టర్, డీఎస్పీ, ఆర్టీవో, సీటీవో, రిజిస్ట్రార్ తదితర గ్రూప్–1 పోస్టులు సాధించాలనే నిరుద్యోగుల లక్ష్యానికి అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి. రాష్ట్రం ఏర్పడ్డాక పదేళ్లకు నోటిఫికేషన్ రాగా, ఏళ్ల తరబడి చదివిన ఉమ్మడి జిల్లాలోని వేలాదిమంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకుని పరీక్షకు సన్నద్ధమయ్యారు. గతేడాది అక్టోబర్ 16న మొదటిసారి ప్రిలిమ్స్ నిర్వహించాక ప్రశ్నపత్రం లీకై రద్దయింది. మరోసారి ఈ ఏడాది జూన్ 11న పరీక్ష నిర్వహించారు. ఈసారి బయోమెట్రిక్, ఓఎంఆర్ షీట్లు, హాల్ టికెట్లలో ఫొటోలు సరిగా లేవని హైకోర్టులో పిటిషన్ వేయగా మరోసారి పరీక్ష నిర్వహించాలని ఆదేశిలిచ్చింది. దీంతో అనేక మంది నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. అయితే రెండోసారి పరీక్ష రాసిన వారి మెరిట్ జాబితా విడుదలైంది. మెయిన్స్‌కు సన్నద్ధమవుతున్న సమయంలో ఈ పరిణామం ఎదురుకావడంతో వారు ఆందోళన చెందుతున్నారు.

ప్రిపరేషన్‌కు రూ.లక్షలు వెచ్చించి..

ఉమ్మడి జిల్లా నుంచి వేలాదిమంది అభ్యర్థులు, నిరుద్యోగులు రూ.లక్షలు ఖర్చు చేసి గ్రూప్–1 సాధించాలని హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ లాంటి ప్రాంతాలతోపాటు సొంతంగా ఇంటి వద్ద, జిల్లా కేంద్రాల్లో సన్నద్ధమవుతున్నారు. కొందరు అప్పు చేసి కొలువు కోసం కష్టపడుతున్నారు. మరికొందరు ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల సహకారంతో కోచింగ్ తీసుకుంటున్నారు. హాస్టల్, పుస్తకాలు, ఇతర ఖర్చులకు నెలకు రూ.వేలల్లో ఖర్చు చేసి కొలువు వస్తుందనే ఆశతో చదివారు. అయితే రెండోసారి కూడా పరీక్ష రద్దు కావడంతో తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. మొదటిసారి కంటే రెండోసారి పరీక్షకు హాజరైనవారి సంఖ్య తగ్గడం వారిలో ఆసక్తి తగ్గడానికి నిదర్శనం. వరుస చేదు అనుభవాలతో కొందరు ప్రిపరేషన్ మానేయాలని భావిస్తున్నారు.

సెలవు పెట్టి.. ప్రైవేట్ కొలువులు మానేసి..

కొందరు ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్న వారు కూడా ఈ పరీక్షకు సన్నద్ధమయ్యారు. వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, కానిస్టేబుళ్లు, ఎస్సైలు, ఏఎంవీఐలు తదితర స్థాయి అధికారులు, ప్రభుత్వ, ప్రైవేట్ టీచర్లు, ఇతర చిరుద్యోగులు కూడా సన్నద్ధమయ్యారు. జీతం కోల్పోయి సెలవు పెట్టి, కుటుంబాలకు దూరంగా ఉండి చదువుతున్నారు. గృహిణులు, చిన్నపిల్లలు, కుటుంబాలను వదిలి హైదరాబాద్‌లో రేయింబవళ్లు కష్టపడ్డారు. ఊహించని విధంగా మరోసారి ప్రిలిమ్స్ పరీక్ష రాయాల్సి వస్తోందని వీరంతా వాపోతున్నారు. మళ్లీ రాయాల్సి వస్తే, పరీక్ష తీరు, పోటీ, శ్రమ, కాలం తదితర కారణాలతో ఆర్థికంగా నష్టపోతున్నామని ఆందోళన చెందుతున్నారు. అయితే మెరిట్‌లో ఉన్నవారు నష్టపోయామని ఆందోళన చెందుతుంటే, పరీక్ష బాగా రాయలేకపోయినవారు మరో అవకాశం చిక్కిందని.. ఈ సారైన నెగ్గాలని భావిస్తున్నారు.

ప్రభుత్వ చేతగాని తనంతోనే..



గ్రూప్–1 పరీక్ష నిర్వహించడంలో లోపాలు ప్రభుత్వ చేతగాని తనంతోనే జరిగాయి. ఇప్పటికే ఓసారి పేపర్ లీకై పరీక్ష రద్దయింది. ఇపుడు మళ్లీ రద్దు కావడంతో హైకోర్టు తీర్పుపై సుప్రీంను ఆశ్రయిస్తామని టీఎస్‌పీఎస్సీ చెప్పడం హాస్యాస్పదం. నిరుద్యోగుల జీవితాలతో ఈ ప్రభుత్వం చెలగాటమాడుతోంది.

– శ్రీనివాస్, టీవీయూవీ రాష్ట్రకార్యదర్శి

రెండేళ్లు వృథా అయింది



జన్నారం: ప్రైవేట్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా ఉద్యోగం మానేసి గ్రూప్–1 ఉద్యోగం సాధించాలని విజయవాడకు కోచింగ్‌కు వెళ్లాను. ప్రైవేట్ ఉద్యోగం కోల్పోయి డబ్బులు ఖర్చు చేసి చదివి మొదటిసారి పరీక్ష రాస్తే రద్దు చేశారు. రెండోసారి కూడా ఇదే పరిస్థితి. రెండేళ్ల సమయం, డబ్బులు వృథా అయ్యాయి.

– గంగరాజ్‌గౌడ్, జన్నారం

మంచిర్యాల నియోజకవర్గంపై ప్రత్యేక నిఘా

- కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సున్నిత నియోజకవర్గంగా గుర్తించబడిన మంచిర్యాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేసేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. శనివారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఇంటెలిజెన్స్ కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్లు బీ రాహుల్, మోతీలాల్, డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మంచిర్యాల నియోజకవర్గ పరిధిలో చేపట్టిన తనిఖీల్లో రూ.2,57,83,732 నగదు, రూ.3,62,933 విలువైన 846 లీటర్ల మద్యం, రూ.30 లక్షల విలువైన కిలో బంగారం, రూ.11,25,300 విలువైన 148 బ్లాంకెట్లు, రూ.6,307 విలువైన చీరెలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గం జిల్లాలో అత్యంత వ్యయ సున్నిత నియోజకవర్గంగా గుర్తించబడిందని పేర్కొన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఎన్నికల నియమావళికి లోబడి ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా అధికారుల సమన్వయంతో కట్టుదిట్టమైన నిఘా ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు. గత అనుభవాల దృష్ట్యా రాబోయే ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా చెక్‌పోస్టులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, వీడియో సర్వేలెన్స్ బృందాల ఖర్చుల పరిశీలన బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, చెన్నూర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ప్రత్యేక ఉపపాలనాధికారి సిడాం దత్తు, మంచిర్యాల ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రాములు, జిల్లా ఆబ్కారీ మద్యనిషేధ అధికారి కేజీ నందగోపాల్, కమర్షియల్ టాక్స్ అధికారి సీహెచ్ శివప్రసాద్‌తో పాటు ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

పారిశుధ్యం లోపించే జ్వరాలు

- జిల్లా వైద్యాధికారి సుబ్బారాయుడు

కాసిపేట: గ్రామాల్లో పారిశుధ్యం లోపించే జ్వరాలు ప్రబలుతున్నాయని, గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలని జిల్లా వైద్యాధికారి సుబ్బారాయుడు సూచించారు. మండలంలోని దేవాపూర్‌లో శనివారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓరియంట్ సిమెంట్ కంపెనీ అధికారులతో మాట్లాడారు. గ్రామాల్లో వైరల్ జ్వరాలకు కారణం పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడమేనని చెప్పారు. దీనిపై యాజమాన్యం దృష్టి సారించాలని సూచించారు. అనంతరం కంపెనీ డిస్పెన్సరీని తనిఖీ చేసి వివరాలు తెలుసుకున్నారు. దేవాపూర్, మద్దిమాడ సర్పంచులను కలిసి పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలని సూచించారు. వైద్యసిబ్బంది 2గంటలు అందుబాటులో ఉంటారని, పెరుగుతున్న జ్వరాల దృష్ట్యా గ్రామాల్లో రోజుకు 13 వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్యశిబిరాలు పరిశీలించారు. ఆయనవెంట వైద్యాధికారి రవికిరణ్, సిబ్బంది ఉన్నారు.



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న సుబ్బారాయుడు

పారిశుధ్యం మెరుగుపర్చండి



సాక్షి ఫోన్ ఇన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్

- మంచిర్యాల పట్టణ ప్రజలు
- సాక్షి ఫోన్ ఇన్‌లో సమస్యల వెల్లువ

మంచిర్యాలటౌన్: రోజురోజుకు విషజ్వరాలు పెరగడంతోపాటు డెంగీ కేసులు నమోదవుతున్నాయని, పనులు చేపట్టి పారిశుధ్యం మెరుగుపర్చాలని, రోడ్లపై మురుగునీరు పారకుండా డ్రెయినేజీలు నిర్మించి, ఖాళీ ప్లాట్లలో పిచ్చిమొక్కలు తొలగింపజేసేలా చర్యలు తీసుకోవాలని, దోమల మందు పిచికారీ చేయాలని మంచిర్యాల పట్టణ ప్రజలు కమిషనర్ మారుతీప్రసాద్ దృష్టికి తీసుకొచ్చారు. 'సాక్షి' ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఫోన్ ఇన్‌లో ప్రజలు సమస్యలు వెల్లడించగా.. కమిషనర్ స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వారంలో ఒక్కరోజు, ప్రతీ ఆదివారం ఉదయం 10గంటలకు పది నిమిషాల పాటు వారి ఇంటి పరిసరాలు, ఇళ్లలో నిల్వ నీటిని తొలగించాలని, చెత్తాచెదారం లేకుండా చూడాలని సూచించారు. ఆహార పదార్థాలు బయట పడేయకుంటే పందులు, కుక్కలు కాలనీల్లోకి రాకుండా ఉండేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. మరిన్ని ప్రశ్నలు, సమాధానాలు..

ప్రశ్న: డ్రెయినేజీ లేక, రోడ్లు, ఖాళీ ప్లాట్లలో మురుగు నీరు నిలిచి జ్వరాల బారిన పడుతున్నాం.
– కుమ్మరి రమేశ్, శ్రీనివాసకాలనీ

కమిషనర్: శ్రీనివాస కాలనీలో రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం జరుగుతోంది. ఖాళీ ప్లాట్లలో నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకుంటాం. పారిశుధ్యాన్ని పూర్తిగా మెరుగుపర్చేందుకు అవసరమైన పనులు చేపడతాం.

ప్రశ్న: డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో మురుగునీరు రోడ్లపై పారుతోంది. పృథ్వీ అపార్టుమెంటు వారు తిన్న ఆహార పదార్థాలు ఓపెన్‌ప్లాటులో వేసి ఇబ్బంది చేస్తున్నారు.
– గజెల్లి లలిత, లక్ష్మీనగర్, రమేశ్, 28వ వార్డు

కమిషనర్: ఇటీవలే సీసీ రోడ్లు నిర్మించారు. త్వరలో డ్రెయినేజీల నిర్మాణం పూర్తి చేస్తాం. ఓపెన్‌ప్లాట్లలో చెత్తాచెదారం వేయకుండా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: మాది గఢ్‌పూర్ గ్రామం. ఆండాళమ్మ కాలనీ నుంచి మా ఊరికి వెళ్లేటప్పుడు మున్సిపల్ శివారులో జంతువుల కళేబరాలు వేయకుండా చర్యలు తీసుకోండి.
– మామిడి మురళీకృష్ణ

కమిషనర్: జంతువుల కళేబరాలు, చికెన్ సెంటర్ల వ్యర్థాలు శివారు ప్రాంతాల్లో వేయకుండా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: తహసీల్దార్ కార్యాలయం పక్కన రెడ్డికాలనీలో ఉన్న పెద్ద డ్రెయినేజీలో చెత్తాచెదారం నిండుకుంటోంది. అందులో చెత్త పడకుండా జాలి వంటిది ఏర్పాటు చేయాలి.
– ఎస్.విజయ్‌కుమార్, రెడ్డికాలనీ

కమిషనర్: అక్కడ పెద్ద డ్రెయినేజీ ఉంది. గ్యాంగ్ వర్క్ పెట్టి అందులో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించి ఇతరులు చెత్త వేయకుండా జాలి ఏర్పాటు చేయడంపై పరిశీలిస్తాం.

ప్రశ్న: ఇస్లాంపురలో రోడ్లు గుంతలుగా మారింది. గణేశ్ నవరాత్రులకు వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పక్కనే కాంట్రాక్టర్లు పనులు చేసి వేసిన రాళ్లను తొలగించండి. – వసీం, ఇస్లాంపుర

కమిషనర్: బెల్లంపల్లి చౌరస్తా నుంచి తెలంగాణ తల్లి విగ్రహం వరకు ఉన్న రోడ్డు కోర్టు వివాదంలో ఉండడంతో రోడ్డు మరమ్మతు పనులు చేపట్టలేక పోతున్నాం. భక్తులకు ఇబ్బందులు లేకుండా గుంతలుగా మారిన రోడ్డుకు మరమ్మతు చేయిస్తాం. రాళ్లను తొలగించేలా చూస్తాం.

ప్రశ్న: ఓవర్‌బ్రిడ్జి కింద కొందరు మలమూత్రాదులు చేయకుండా, చేపలు, మేకల కాళ్లు, తలకాయలు కాల్చకుండా చూడండి.
– వెంకట్, చెన్నూరుగేట్

కమిషనర్: ఓవర్‌బ్రిడ్జి కింద ఉన్న వారిని ఇదివరకే ఇతర ప్రాంతాలకు పంపించాం. ఎవరున్నా మరోచోటుకు తరలించి, బయటి ప్రదేశాల్లో మలమూత్రం విసర్జన చేయకుండా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: ఎన్టీఆర్ నగర్ కాలనీ, 3వ వార్డులో దోమలు, కుక్కల బెడద ఎక్కువగా ఉంది. నివారణ చర్యలు చేపట్టండి.
– చింతకింద పద్మావతి, ఎన్టీఆర్‌నగర్ కాలనీ, రజియాబేగం, 3వ వార్డు

కమిషనర్: దోమలను అరికట్టేందుకు ఫాగింగ్ చేయడంతోపాటు కుక్కల బెడద లేకుండా చేసేందుకు చర్యలు తీసుకుంటాం. మరో రెండు వారాల్లో కుక్కలను ఎనిమల్ కేర్ సెంటర్‌కు తరలిస్తాం.

ప్రశ్న: డ్రెయినేజీలో విద్యుత్ స్తంభం ఉంచడం వల్ల చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. స్తంభాన్ని తొలగించాలి.
– మిట్ట శ్రీనివాస్, 13వ వార్డు, హమాలీవాడ

కమిషనర్: విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి స్తంభం తొలగింపునకు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: ఓవర్‌బ్రిడ్జి కింద రోడ్డుపైనే గేదెలను కట్టేయడంతో అపరిశుభ్రంగా మారి దోమలు వ్యాప్తిచెందుతున్నాయి.
– కిరణ్, అబ్దుల్ అలీం, రాజారాం, 18వ వార్డు

కమిషనర్: గేదెల యజమానులతో మాట్లాడి ఇంటి పరిసరాల్లోనే కట్టేసేలా చూస్తాం. బురద లేకుండా, అపరిశుభ్రంగా ఉంటే తొలగించి దోమలు రాకుండా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: రాళ్లపేట్‌లోని డ్రెయినేజీల్లో పూడిక తీయకపోవడంతో రోడ్లపైకి మురుగు నీరు వచ్చి దుర్వాసన వస్తోంది. – అఫ్రీన్, రాళ్లపేట్, రోడ్డు నంబర్ 2

కమిషనర్: డ్రెయినేజీల్లో పూడికతీత పనులు వెంటనే చేపట్టి రోడ్లపైకి నీరు రాకుండా చూస్తాం.

ప్రశ్న: రైల్వే గేటు మూసేసిన చోట మట్టికుప్పలు పోయడంతో వర్షపు నీరు నిలిచి దుర్వాసన, దోమలు వస్తున్నాయి. – సురేశ్ బల్దువా, వార్డు కౌన్సిలర్

కమిషనర్: ఇప్పటికే రైల్వే అధికారులతో ఈ విషయమై మాట్లాడాం. వారు పనులు చేయకుండా, మున్సిపల్ ద్వారా చేపట్టకుండా చేస్తున్నారు. ఈ సమస్యకు వెంటనే పరిష్కారం చూపిస్తాం.

ప్రశ్న: డ్రెయినేజీలు కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. రెండో వార్డు గాంధీనగర్‌లో డ్రెయినేజీ నీరు బయటకు పోకుండా అడ్డుకుంటున్నారు. చర్యలు తీసుకోండి. సూర్యనగర్‌లో డ్రెయినేజీలు, రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఖాళీ ప్లాట్లలో పిచ్చిమొక్కలు, నిలుస్తున్న నీటితో దోమలబారిన పడుతున్నాం.
– శంకర్, మంచిర్యాల, సాగర్, గాంధీనగర్, బొద్దుల రవి, కుమారస్వామి, కరుణాకర్, చున్నంబట్టివాడ, సాగర్‌రెడ్డి, నాగదేవత కాలనీ

కమిషనర్: మున్సిపాలిటీలో ఎక్కడ డ్రెయినేజీలపై అక్రమ నిర్మాణాలు చేపట్టినా తొలగించేలా చర్యలు తీసుకుంటాం. డ్రెయినేజీ నీరు వెళ్లేలా పూర్తి స్థాయి నిర్మాణం చేపడుతాం. ఓపెన్ ప్లాటులోకి డ్రెయినేజీ నీరు వెళ్లకుండా, బయటకు వెళ్లేందుకు అవసరమైన పనులు, డ్రెయినేజీలు, రోడ్ల నిర్మాణం చేపడతాం.

ప్రశ్న: రామునిచెరువులోని పూడిక తొలగించి బురదగా మారుతున్న వాకింగ్ ట్రాక్‌ను బాగు చేయాలి.
– గజెల్లి వెంకటయ్య, రామునిచెరువు

కమిషనర్: రాముని చెరువు అభివృద్ధి కోసం రూ.3.5 కోట్లతో పనులు చేపడుతున్నారు. త్వరలోనే పూర్తి చేస్తాం. పనులు జరుగుతున్నప్పుడు వాకింగ్ ట్రాక్‌ను బాగు చేయడం కుదరదు. పనులు పూర్తయిన తర్వాత వాకింగ్ ట్రాక్ బురదగా మారదు. చెరువులోని పూడిక తీత పనులను ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు తీసుకుంటాం.

క్లుప్తంగా

ప్రమాదవశాత్తు కాలువలోపడి వ్యక్తి మృతి


శ్రీహరి (ఫైల్)

జన్నారం(ఖానాపూర్): ప్రమాదవశాత్తు కాలువలోపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన జన్నారం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందన్‌పల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం జన్నారం మండలం ఇందన్‌పల్లికి చెందిన మంతుర్తి శ్రీహరి (41) శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. రాత్రి ఇంటికి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. అనుమానం వచ్చిన ఎస్సై సతీశ్ కడెం కాలువ నీటిని ఆపివేయించారు. కాలువలో వెదుకగా కొత్తూరుపల్లి సమీపంలో మృతదేహం కనిపించింది. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుని భార్య చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

దహెగాం(సిర్పూర్): మండలంలోని అయినం గ్రామ శివారులోని పెద్దవాగులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం గుర్తించినట్లు ఎస్సై సనత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మృతుని వయస్సు 35 నుంచి 40 ఏళ్ల లోపు ఉంటుందని, బూడిదరంగు షర్టు, లేత నలుపు రంగు ప్యాంటు, బ్రౌన్ కలర్ బనియన్ ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని సిర్పూర్(టి) సామాజిక ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచామని, గుర్తుపట్టినవారు 8374494388 నంబరులో సంప్రదించాలని ఎస్సై సూచించారు.

పిడుగుపాటుతో ఇద్దరు మృతి


చంద్రకళ (ఫైల్)


దేవురావు(ఫైల్)

ఆసిఫాబాద్అర్బన్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో శనివారం వేర్వేరు చోట్ల పిడుగుపాటుతో ఇద్దరు మృతి చెందారు. జిల్లా కేంద్రంలోని హీరాపూర్‌కు చెందిన లక్ష్మీబాయి, విఠు దంపతులు తమ కుమార్తె చంద్రకళ (20)తో కలిసి పంటచేనులో మందులు వేస్తుండగా ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన శబ్దం వచ్చి చంద్రకళపై పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. లక్ష్మీబాయికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గుట్టచెలిమలో యువకుడు..

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని చిర్రకుంట జీపీ పరిధిలోని గుట్టచెలిమకు చెందిన దేవురావు (24) శనివారం ఉదయం పత్తి చేనులో గడ్డి కుప్పలు తీసేందుకు భార్య లక్ష్మీతో కలిసి వెళ్లాడు. మధ్యాహ్నం వర్షం కురియడంతో ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో పిడుగుపడడంతో దేవురావు అక్కడికక్కడే మృతి చెందాడు.

26న చాకలి ఐలమ్మ జయంతి

మంచిర్యాలటౌన్: నస్పూర్‌లోని కలెక్టరేట్ కార్యాలయంలో ఈ నెల 26 న వీరనారి చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి బి.వినోద్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

విత్తన గణపతిం భజే..!

పర్యావరణ హితానికి మట్టి వినాయక ప్రతిమల తయారీ, ఏర్పాటు ఏటేటా పెరుగుతోంది. నిర్మల్ జిల్లాలో మాత్రం మట్టి గణేశ్ ప్రతిమలు నిమజ్జనం చేస్తే కరిగిపోవడమే కాదు మొక్కగా మొలకెత్తనున్నాయి. వివిధ రకాల విత్తనాలతో మట్టి ప్రతిమలు తయారు చేయించి అటవీ సంపద వృద్ధికి నిర్మల్ డీఆర్డీవో విజయలక్ష్మి చేపట్టిన ప్రయోగం సత్ఫలితాల దిశగా సాగుతోంది. విత్తన గణపతులు ఒక్కటే కాదు.. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన నిర్మల్ కొయ్య బొమ్మలకు కీలకమైన ముడి సరుకు పొనికికర్ర.. అలాంటి పొనికికర్ర కొరత ఏర్పడి ఉనికి ప్రశ్నార్థకమవుతున్న తరుణంలో పొనికి కర్రవనానికి జీవం పోశారు.

– సాక్షి, మంచిర్యాలడెస్క్


ఇటీవల నిర్మల్‌రూరల్ మండలం భాగ్యనగర్‌లో మట్టి వినాయకులు పంపిణీ చేసిన డీఆర్డీవో విజయలక్ష్మి

సండే స్పెషల్


విత్తన గణపతి

- మట్టి వినాయక ప్రతిమల్లో విత్తనాలు
- ఐదు రకాల విత్తనాలతో తయారీ
- నిర్మల్ డీఆర్డీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమాలు

మహిళా సంఘాల ఆధ్వర్యంలో..

కొందరు వినాయకులను ఇళ్ల వద్ద నిమజ్జనం చేస్తుండగా, ఎక్కువగా చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేస్తుంటారు. ఎక్కడ నిమజ్జనం చేసినా గణపతి నుంచి మొలక రావాలనే ఉద్దేశంతో పర్యావరణ హిత బీజ గణపతుల తయారీని ఎంచుకున్నారు. భారత ప్రభుత్వం అమృత్ సరోవర్‌లో భాగంగా చెరువుల పక్కన నడక దారిలో వేప, రావి మొక్కలు నాటాలని సూచిస్తోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రధానంగా ప్రతిమల్లో రావి, మర్రి, వేప విత్తనాలతోపాటు జువ్వి, గంధం, సీతాఫలం విత్తనాలతో చిన్న మట్టి గణపతులు తయారు చేశారు. మట్టి కరిగిన తర్వాత అందులోని విత్తనాలు మొలకెత్తుతాయి. డీఆర్డీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో మహిళా ప్రగతి జిల్లా సమాఖ్య రూరల్ మార్ట్ ద్వారా ఏపీఎంలు 15 నుంచి 20 మంది మూడు వేల ప్రతిమలు తయారు చేశారు. ఈ నెల 17న నిర్మల్ కలెక్టరేట్‌లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్ పంపిణీ చేశారు. ఒక్కో మండలానికి 200 వరకు అందజేశారు. అక్కడికక్కడే సుమారు వందకు పైగా మంది రూ.100కు ఒకటి చొప్పున కొనుగోలు చేశారు. విత్తన గణపతుల తయారీకి జిల్లా సమాఖ్య నుంచి కొంతమొత్తం రుణంగా పొందారు. ఇలా ప్రతిమల విక్రయాల ద్వారా వచ్చిన డబ్బును రుణం తీర్చడానికి 50 శాతం, తయారీలో పాల్గొన్న ఏపీఎంలు, గ్రామాల్లో పంపిణీ చేసిన వీఓఏల ఖాతాల్లో మిగతా 50 శాతం జమ చేస్తున్నారు.

పొనికివనం..

నిర్మల్ కొయ్యబొమ్మలకు అధిక ధర ఉంటుంది. అందుకు పొనికికర్ర కొరతే కారణమని గ్రహించిన డీఆర్డీవో విజయలక్ష్మి పొనికివనం ఏర్పాటుపై దృష్టి సారించారు. పొనికి మొక్కల కోసం చాలా చోట్ల గాలించారు. మామడ అడవిలో లభించిన పొనికి కర్రను తెచ్చి అంటుగట్టినా ఆశించిన మేరకు ఫలితం రాలేదు. గత సంవత్సరం ఒక్కో నర్సరీలో వెయ్యి చొప్పున పెంచారు. వీటిలో 20 శాతం వరకు బతికాయి. కలెక్టర్ ప్రోత్సాహంతో ఉత్తరాఖండ్ రాష్ట్రం నుంచి ఒక్కో మొక్కను రూ.150 చొప్పున కొనుగోలు చేసి ఐదు వేల మొక్కలు తెప్పించారు. సారంగాపూర్ మండలంలోని ఆరెకరాలు, మామడ మండలంలోని మూడెకరాల అటవీ ప్రాంతంలో పొనికి మొక్కలు నాటారు. కొత్తచిగుర్లు తొడిగి కొమ్మలు వస్తున్నాయి. ఈ పొనికివనంపై అటవీశాఖ ద్వారా సీఎం కేసీఆర్ ఆరా తీసినట్లు తెలిసింది.


పొనికి మొక్క నాటి సెల్ఫీ తీసుకుంటున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి (ఫైల్)

- మహిళా సంఘాల ఆధ్వర్యంలో గత సంవత్సరం దీపావళికి మట్టి ప్రమిదలు తయారు చేసి విక్రయించారు. కేవలం పది రోజుల్లో రూ.70వేలు వచ్చాయి. జిల్లా మహిళా సమాఖ్య నుంచి తీసుకున్న రుణం తీర్చగా మిగిలిన లాభాన్ని గ్రామాల్లోని వీవోఏలకే అందజేశారు.
- గత సంవత్సరం జూన్‌లో కడెం మండలం మద్దిపడగ గ్రామంలో అంగన్‌వాడీ పిల్లలతో సీడ్ బాల్స్ చేయించారు.
- అంగన్‌వాడీ కేంద్రాల్లో బరువు, ఎత్తు తక్కువ ఉన్న పిల్లల కోసం పోషకపాత్ర నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంతోపాటు అదనంగా పోషక పాత్ర అమలు చేస్తున్నారు. పిల్లలు ఇంటికి వెళ్లిన తర్వాత రోజుకో తీరున స్థానికంగా లభించే చేపలు, చికెన్, ఆకు కూరలు అందిస్తున్నారు. ఏదీ లేని రోజు పాత్ర నిండా పాలు తాగేలా వీఏఏలు అక్కడే ఉండి పర్యవేక్షిస్తున్నారు.
- తెలంగాణలో మొదటిసారిగా కడెం మండలం నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలకు మధ్యలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గోబర్‌గ్యాస్ యూనిట్ ఏర్పాటు చేశారు. ఊహించిన దానికంటే ఎక్కువగా గ్యాస్ వస్తోంది. అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలో వంటలకు సరిపోతోంది.
- ఒకే రోజు 5,940 ఇంకుడు గుంతలు నిర్మించారు. ఒకేసారి నిర్మాణం చేపట్టి రికార్డు సృష్టించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ఇంకుడుగుంతల వల్ల నీరు ఇంకి బురదగా మారడం తగ్గింది. వీటివల్ల భూగర్భజలాలు వృద్ధి చెందినట్లు తెలుస్తోంది.

రెండు నెలలకో ఇన్నోవేషన్



నిర్మల్ జిల్లాలో బాధ్యతలు చేపట్టి ఏడాది పది నెలలు కావొస్తోంది. మట్టి గణపతుల తయారీ, ఆపరేషన్ సంకల్ప్, కిచెన్‌గార్డెన్, పౌష్టిక పాత్ర, పొనికివనం ఇలా దాదాపు రెండు నెలలకో ఇన్నోవేషన్ తీసుకొచ్చాం. గత దసరాకు మట్టి ప్రమిదలు తయారు చేయించి విక్రయించాం. 'మన అంగన్‌వాడీ–మన ఆకు కూరలు' అనే నినాదంతో ప్రతీ గ్రామంలో కిచెన్‌గార్డెన్ నిర్వహిస్తున్నాం. ప్రతీ ఇంటికి కిచెన్ గార్డెన్, గ్రామంలో కమ్యూనిటీ కిచెన్ గార్డెన్ ఉన్నాయి. మునగాకు, కారప్పొడి తయారీపై ముధోల్‌లో మహిళా సమాఖ్యకు శిక్షణ ఇప్పించాం. అడవిలో పెరిగే రేలా విత్తనాలు కూడా వేశాం. ఇంటిగ్రేటెడ్‌ఫార్మింగ్‌పై దృష్టి సారించాం.

– విజయలక్ష్మి, డీఆర్డీవో, నిర్మల్

'కంపెనీ బ్రాండెడ్ పేరు వాడుతున్నారు..'

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రం మంచిర్యాలలో బండారి రాజేంద్రప్రసాద్ తయరు చేసి విక్రయిస్తున్న కంఫర్ట్ ప్యాకెట్లు నకిలీవి కాదని ప్రముఖ కంపెనీకి చెందిన బ్రాండెడ్ పేరును వాడుకుంటున్నాడని తనిఖీలు నిర్వహించిన న్యాయవాది సదానందం ఫోన్ ద్వారా స్పందించారు. 'బ్రాండెడ్ పేరిట నకిలీ చెలామణి' శీర్షికన శనివారం ప్రచురితమైన కథనంపై కంపెనీ తరఫు న్యాయవాది స్పందిస్తూ.. రాజేంద్రప్రసాద్ అతనికి తెలియకుండానే కంఫర్ట్ కంపెనీ బ్రాండెడ్ పేరును వాడుకుంటున్నాడనే ఆరోపణల మేరకు ముంబయి హైకోర్టులో కేసు నడుస్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలో కోర్టు ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని సదరు యజమాని ఇంట్లో తనిఖీలు చేయడం జరిగిందని తెలిపారు. నకిలీవి కాదని, కేవలం బ్రాండెడ్ పేరును అనుమతి లేకుండా వాడుకున్నాడనే ఆరోపణల మేరకు కోర్టు ఆదేశాలతో తనిఖీలు నిర్వహించి నోటీసులు అందజేసినట్లు తెలిపారు.


అనుమతి లేకుండా బ్రాండెడ్ పేరుతో లభించిన కంఫర్ట్ ప్యాకెట్లు

రేపు బాల్‌బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక పోటీలు

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని గోలేటిటౌన్‌షిప్‌లో గల సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం ఉమ్మడి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సబ్ జూనియర్స్ (అండర్ –15) బాల బాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.నారాయణరెడ్డి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 30 నుంచి అక్టోబర్ 2 వరకు నిజామాబాద్ జిల్లా మామిడిపల్లి ఆర్మూర్ అల్ఫోర్స్ పాఠశాలలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సింగరేణి ఉన్నత పాఠశాల పీఈటీ భాస్కర్‌ను 9948629413 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వాగులో కొట్టుకుపోయి మహిళ మృతి

ఆసిఫాబాద్‌రూరల్: వాగు దాటే క్రమంలో కొట్టుకుపోయి మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది . కుటుంబ సభ్యులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చిర్రకుంట జీపీ పరిధిలోని ఎర్రగుట్టకు చెందిన భీంబాబు (55), భర్త భీముతో కలిసి ఉదయం ఆసిఫాబాద్‌కు వచ్చి నిత్యావసరాలు కొనుగోలు చేశారు. ఆసిఫాబాద్ నుంచి చిర్రకుంట వరకు ఆటోలో వచ్చి అక్కడి నుంచి కాలినడకన బయలుదేరారు. మధ్యలో వాగు దాటుతుండగా నీటి ప్రవాహానికి భీంబాయి కొట్టుకుపోయింది. భీము కేకలు వేయడంతో స్థానికులు వచ్చి ఒడ్డుకు చేర్చినా అప్పటికే మృతి చెందింది.

వివాహిత అదృశ్యం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన లింగంపెల్లి సౌందర్య శనివారం నుంచి కనిపించడం లేదని ఆమె తల్లి కంపెల్లి రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. కాలనీకి చెందిన లింగంపెల్లి సతీష్‌కు పెద్దపల్లి జిల్లా అంతర్‌గాంకు చెందిన సౌందర్యతో 2013లో వివాహమైంది. దంపతులకు ముగ్గురు కుమారులు సంతానం. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో శనివారం నుంచి ఇంట్లో కనిపించక పోవడంతో సతీష్ సౌందర్య తల్లి రాజేశ్వరికి సమాచారం అందించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో జిల్లా యువకుడు మృతి


వంశీ (ఫైల్)

మంచిర్యాలక్రైం: హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మంచిర్యాలకు చెందిన యువకుడు మృతి చెందినట్లు సమాచారం. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక కైలసగిరి కాలనీకి చెందిన నలిమెల తిరుపతి, వినోద దంపతుల కుమారుడు వంశీ(23) హైదరాబాద్‌లోని ఓ కంపనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. తన స్నేహితునితో కలిసి ద్విచక్రవాహణంపై ఖైరతాబాద్‌లోని గణేశ్ విగ్రహాన్ని చూసేందుకు వెళ్లి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో వంశీ అక్కడికక్కడే మృతి చెందగా అతని స్నేహితునికి స్వల్పగాయాలయ్యాయి.

చట్టాలపై అవగాహన ఉండాలి


దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): విద్యార్థులు చదువుతో పాటు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని లక్సెట్టిపేట కోర్టు జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లాషరీఫ్ అన్నారు. శనివారం హాజీపూర్‌లోని సబ్బెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లక్సెట్టిపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు జడ్జి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్జి దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో హాజీపూర్ సర్పంచ్ జూపాక రాజేశ్వరి, హెచ్‌ఎం సుధారాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కారుకూరి సురేందర్, ఏజీపీ పద్మ, జైలర్ స్వామి పాల్గొన్నారు.

25న సింగరేణి హెడ్ ఆఫీస్ ముట్టడి

శ్రీరాంపూర్: కాంటాక్ట్ కార్మికుల సమస్యలపై ఈ నెల 25న కొత్తగూడెంలోని సింగరేణి హెడ్ ఆఫీస్‌ను ముట్టడించనున్నట్లు సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ ప్రధాన కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్ తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణిలో 30 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని, సరైన వేతనాలు అందక శ్రమదోపిడీకి గురవుతున్నారన్నారు. హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని, లాభాల్లో వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్షుడు రవీందర్, నాయకులు రాజు, ప్రభాకర్, సమ్మయ్య, వెంకటేశ్, శ్రీహరి, మల్లయ్య పాల్గొన్నారు.

మ్యాన్‌రైడింగ్ సమస్యలు పరిష్కరించాలి

జైపూర్: మ్యాన్ రైడింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం ఇందారం ఐకే1ఏ గనిపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గని మేనేజర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి నవీన్‌రెడ్డి, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే.వీరభద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి గాయాలు

చింతలమానెపల్లి: మండలంలోని ఖర్జెల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం విద్యార్థుల మధ్య తలెత్తిన గొడవలో మూడో తరగతి విద్యార్థి దంద్రె విశ్వనాథ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. తరగతిగదిలో ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు గొడవపడ్డట్లు తెలుస్తోంది. సదరు ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయుడికి సమాచారం అందించినా స్పందించలేదని సమాచారం.

లక్ష్యం ఎంచుకుని ఉన్నతస్థితికి చేరుకోవాలి

- సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ


మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

బెల్లంపల్లి: జీవితంలో ఉన్నతంగా ఎదగడానికి లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ (జేడీ) లక్ష్మీనారాయణ అన్నారు. ఉదయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని పద్మశాలి భవన్‌లో విద్యార్థి, యువజనులకు దిశా నిర్దేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జేడీ మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశలకు అనుగుణంగా నడుచుకుని ప్రయోజకులు కావాలన్నారు. అనంతరం ఆయనకు పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ ఉదయ్‌కాంత్, హైకోర్టు రిటైర్డు జడ్జి అనిల్ కిరణ్‌కుమార్, వర్ధమాన సినీ నటుడు రాంకీ, నిర్మాతలు చినబాబు, కానూరు శ్రీనివాస్, ఐటీ సీనియర్ మేనేజర్ (ఎంఏ కార్పోరేట్) రాయల నవీన్, ఉమ్మడి రాష్ట్ర ఆప్కో మాజీ చైర్మన్ గడ్డం జగన్నాథం, ఫౌండేషన్ ట్రస్ట్ సభ్యుడు రంగ ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల రుణం తీర్చుకోవాలి

తాండూర్: పిల్లలు తల్లిదండ్రుల రుణం తీర్చుకోవాలని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ (జేడీ) లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కేజీబీవీలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉదయ్ ఫౌండేషన్ చైర్మన్ ఉదయ్‌కాంత్, కేజీబీవీ ప్రత్యేక అధికారి సుమన చైతన్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళాశాల ఎదుట తల్లిదండ్రుల ఆందోళన


ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం నిర్వహించిన స్పాట్ సెలెక్షన్‌లో సమాచారం సరిగా ఇవ్వలేదని విద్యార్థుల తల్లిదండ్రులు కళాశాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఆరోతరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు మిగిలిన సీట్ల భర్తీ కోసం ఇటీవల నోటిఫికేషన్ విడుదలైంది. అందులో అందరికీ అని తెలుపడంతో అన్ని కేటగిరీలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. దీంతో ఎస్సీ కేటగిరీ విద్యార్థులకు మాత్రమే స్పాట్ సెలక్షన్ జరుగుతుందని తెలపడంతో మిగతా విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. పోలీసులు వచ్చి సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. దీనిపై కళాశాల కోఆర్డినేటర్ స్వరూపరాణిని వివరణ కోరగా మేము సరిగానే నోటిఫికేషన్ ఇచ్చామని, సరిగ్గా అర్థంచేసుకోకుండా ఇబ్బందులకు గురయ్యారన్నారు.

జిల్లాస్థాయి చెస్ ఎంపిక పోటీలు


చెస్ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

తాండూర్: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని సురభి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి బాలబాలికలకు అండర్ –14,17 విభాగాల్లో చెస్ ఎంపిక పోటీలను ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చెస్ క్రీడలో రాణించడం సాధారణ విషయం కాదన్నారు. ఎంతో ప్రతిభ పాటవాలు ప్రదర్శించాల్సి ఉంటుందన్నారు. ఎంపీపీ ప్రణయ్, జెడ్పీటీసీ బానయ్య, ఎంపీటీసీలు శంకర్, శ్రీదేవి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి చెస్ పోటీలు

మందమర్రిరూరల్: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో శనివారం జిల్లాస్థాయి చెస్ పోటీలు జరిగాయి. ఉమ్మడి జిల్లా నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు జిల్లా యువజన క్రీడల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిరాజ్ ఉర్ రహమాన్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఈగ కనుకయ్య, సిద్దయ్య, కల్పన, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల కళాశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. 11 పాఠశాలల నుండి 350 మంది క్రీడాకారులు పోటీలో పాల్గొనగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. రన్నింగ్ విభాగంలో పాఠశాలకు చెందిన కునాల్ తేజ ఓవరాల్ చాంపియన్‌గా ఎంపికయ్యాడు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్ గౌడ్, జెడ్పీటీసీ ముత్తె సత్తయ్య, కౌన్సిలర్ చాతరాజు రాజన్న, ప్రిన్సిపాల్ గౌతంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.